బంజారాల దైవం సేవాలాల్

- సేవాలాల్ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే సునీత

తుర్కపల్లి చిన్నలక్ష్మాపురం శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

తుర్కపల్లి, ఫిబ్రవరి 19 : సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాల దైవమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత వేర్వేరుగా పాల్గొన్నారు. గిరిజనుల సాంప్రదాయ భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. ఐదు వందల జనాభా కలిగిన ప్రతి తండాను గ్రామ పంచాయతీగా చేయడంతో గిరిజనులు స్వయం పాలన చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం చిన్న లక్ష్మాపురం గ్రామంలోని శివాలయంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ప్రభుత్వ విప్ ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే సునీత వేర్వేరుగా పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, మాజీ ఎంపీపీ భూక్యా సుశీలారవీందర్, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, ఎంపీటీసీ కోమటిరెడ్డి సంతోష, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు షరీఫ్, శంకర్‌నాయక్, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌నాయక్, చత్రునాయక్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా యాదగిరీశుడి తిరుకల్యాణోత్సవం

స్పటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 19 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సోమవారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో లక్ష్మీనరసింహుడికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రివేళ స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చనలు జరిగాయి. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు ...వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. ---- ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న దేవాదాయ, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర దేవాదాయ, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చక బృందం వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ రామకృష్ణారావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓ రఘు, శ్రవణ్‌కుమార్, రామ్మోహన్, ఆలయ అధికారి రాజన్‌బాబు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

- ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆలేరు, ఫిబ్రవరి 19 : ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు రావాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి లక్షా యాభై వేలతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన వారు అనేక మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర సర్కారు ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గంధమల్ల అశోక్, షెడ్డు నిర్మాణ దాత ఉపేందర్‌రెడ్డి, ఎస్‌సీసీ అధికారి వెంకటేశ్, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ లక్ష్మణ్‌నాయక్, ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శ్యామసుందరి, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 19 : పట్టణంలోని ప్రగతినగర్, ఓంకార్ నగర్‌లో గుర్రాల లక్ష్మమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు గుర్రాల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే అభినందించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, తంగెళ్లపల్లి రవికుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్ పాల్గొన్నారు.

క్యాంప్ కార్యాలయంలోకి ఎమ్మెల్యే కుంభం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 19 : పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా కార్యాలయాన్ని ప్రారంభించి లోపలికి ప్రవేశించారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 33వ వార్డు కౌన్సిలర్ అవంచ క్రాంతి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే మంచి గుర్తింపు : ఎంపీపీ

ఎంపీడీఓ, ఎస్ఐలను సన్మానిస్తున్న ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, అధికారులు, నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 19 : విధి నిర్వహణలో ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ బాల శంకర్, ఎస్ఐ విక్రంరెడ్డిని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరితో మమేకమైనప్పుడే గుర్తింపు వస్తుందని, సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, జడ్పీటీసీ కోట పుష్పలత, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్లు కందాడి భూపాల్‌రెడ్డి, అందెల లింగంయాదవ్, ఎంపీటీసీ బత్తుల మాధవి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మార్కండేశ్వర స్వామి రథోత్సవం

భూదాన్ పోచంపల్లిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 19 : పట్టణంలోని మార్కండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన రథంపై స్వామివారిని ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. సీత వారి వంశస్తుల ఆధ్వర్యంలో కోలాట నృత్య ప్రదర్శనలతో మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, దిష్టి కుంభం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బడుగు చండికేశ్వర్, ఉపాధ్యక్షుడు బోగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి మంగళపల్లి రాజారమేశ్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, నాయకులు పురుషోత్తం, శివకుమార్, దామోదర్, స్వామి, వెంకటేశం, రమేశ్, బసవలింగం, సత్యనారాయణ, వినోద్, శ్రవణ్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

28న భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 19 : భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఈ నెల 28న ఎన్నిక నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కొండల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యపై జనవరి 23న కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన విషయం తెలిసిందే. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకునేందుకు 28న సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చిన్న మేడారం జాతరలో మద్యం విక్రయిస్తే చర్యలు

రాజాపేట, ఫిబ్రవరి 19 : చిన్న మేడారం జాతరలో మద్యం విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ దీపిక హెచ్చరించారు. మండలంలోని చిన్న మేడారాన్ని సోమవారం ఆమె సందర్శించి మాట్లాడారు. ఆమె వెంట ఎక్సైజ్ ఎస్ఐ నిరోష, సిబ్బంది బాలరాజు, ఉప్పలయ్య, మంజుల, విజయలక్ష్మి ఉన్నారు.

యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా నవీన్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 19 : తెలంగాణ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని కూరెళ్ల గ్రామానికి చెందిన బాషబోయిన నవీన్‌యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షుడిగా బాషబోయిన ప్రదీప్‌యాదవ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో వారికి సంఘం జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ నియామక పత్రం అందజేశారు.

ఆర్థిక సాయం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని దోతిగూడెం గ్రామానికి చెందిన బడే నాగరాజు (30) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన పిల్లల భవిష్యత్తు కోసం గ్రామంలోని వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన 55వేల రూపాయలను నాగరాజు భార్యకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యం యాదవ్, వెంకటేశ్, నరేశ్, సత్తయ్య, సందీప్, విజయ్‌కుమార్, కిరణ్, భాను, వంశీ పాల్గొన్నారు.

ముగిసిన గ్రామీణ క్రీడలు

గుండాల, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన మోత్కూరు పాత తాలూకా స్థాయి గ్రామీణ క్రీడలు సోమవారం ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్ పోటీల విజేతలకు పూర్వ విద్యార్థి ఈరసరపు యాదగిరిగౌడ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం, ఎంపీటీసీ నరేశ్, నాయకులు షర్ఫొద్దీన్, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్‌కు వినతి

చౌటుప్పల్, ఫిబ్రవరి 19 : మున్సిపాలిటీ పరిధిలోని 113, 114 సర్వే నెంబర్లలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు స్థానికుడు తొర్పునూరి రవిగౌడ్ సోమవారం వినతి పత్రం అందజేశారు. గతంలో 113 సర్వే నెంబర్‌లో 36గుంటల భూమిని గుర్తించి రెవెన్యూ అధికారులు హద్దురాళ్లు నాటారని తెలిపారు. అయినా కొంతమంది ఆక్రమణదారులు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే స్పందించి అన్యాక్రాంతమైన భూమిని కాపాడాలని ఆయన కోరారు.

శ్రీశైలానికి జీవిత సాఫల్య అవార్డు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 19 : మండల కేంద్రానికి చెందిన నీడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కానుగంటి శ్రీశైలం మండల ప్రజలకు అందించిన సేవలకుగాను నేతాజీ సుభాశ్ చంద్రబోస్ లైఫ్ టైం అచీవ్ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం అవార్డు అందుకున్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- వక్ఫ్ భూముల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ ఇక్బాల్

చౌటుప్పల్, ఫిబ్రవరి 19 : వక్ఫ్ బోర్డు భూముల కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వక్ఫ్ భూముల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ ఎంఏ ఇక్బాల్ అన్నారు. భూముల పరిరక్షణపై పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూముల కబ్జాదారులపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే వక్ఫ్ భూములను సర్వే చేసి హద్దు రాళ్లు నాటాలని కోరారు. అనంతరం చౌటుప్పల్ వక్ఫ్‌బోర్డు భూముల పరిరక్షణ వేదిక కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎండీ పాషా, ఎండీ గౌస్, ఎస్‌కే లతీఫ్, బాబాషరీఫ్, హన్నుబాయ్, ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలపై సత్వరమే స్పందించాలి

- అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యమిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఎ.భాస్కర్‌రావు జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వారు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలని, జిల్లాలో ఎక్కడా సమస్య తలెత్తకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి 21 ఫిర్యాదులు అందాయని, అందులో రెవెన్యూ శాఖకు చెందినవి 12, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి ఆరు, మున్సిపాలిటీ, టౌన్ ప్లానింగ్, వైద్య శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ ఎన్.శోభారాణి, డీఆర్‌డీఓ ఎంఏ కృష్ణన్, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై అదనపు కలెక్టర్ సీరియస్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు సీరియస్ అయ్యారు. ఆత్మకూరు(ఎం) జిల్లా పరిషత్ పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న గోపాల్ ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డిపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఎస్ఎంసీ తీర్మానాలు లేకుండా నిధులు దుర్వినియోగం చేశారని, తనకు నచ్చిన ఉపాధ్యాయులకు ఇష్టానుసారంగా సెలవులు మంజూరు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పాఠశాల సమయంలో సెలవు పెట్టకుండా ఎందుకు వచ్చారని అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు గోపాల్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారులను ఆదేశించారు.

ఎయిమ్స్‌లో క్రీడా పోటీలు ప్రారంభం

క్రీడలను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, ఫిబ్రవరి 19 : మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో 4వ క్రీడా వార్షికోత్సవాన్ని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. క్రీడలతో మానవ జీవితంలో విలువలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో డీన్ రాహుల్ నరంగ్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా, డిప్యూటీ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ బిపిన్ వర్గీస్, శ్యామ్ సుందర్, రేఖ, ప్రియదర్శిని, గీత, సందీప్, శ్రావణి పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

భూసార పరీక్ష యంత్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు

గుండాల, ఫిబ్రవరి 19 : మండలంలోని సుద్దాల గ్రామంలో నేలతల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాబార్డు వారి సహకారంతో భూసార పరీక్షల యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం వరి పంటను ఆశించే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ మధుబాబు, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, ఎంటమాలజిస్ట్ ఉపేందర్, రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ మంద రాములు, డైరెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, రాజు, మల్లారెడ్డి, రేఖ, మమత, సీఈఓ సురేందర్ రెడ్డి, అండెం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న ఎంపీడీఓ సత్యానంద్ ప్రసాద్

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 19 : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సత్యానంద్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని గుండ్లగూడెంలో మల్లారెడ్డి నారాయణ దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల ఆరోగ్యం కోసం గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న మల్లారెడ్డి నారాయణ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో 170 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ఐశ్వర్య, మనోజ్, పంచాయతీ కార్యదర్శి గణగాని శశికాంత్‌గౌడ్, క్యాంప్ ఆర్గనైజర్ ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త తొర్ర విష్ణు సోమవారం పుస్తకాలు బహూకరించారు. అదేవిధంగా 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అరవిందరాయుడు, గ్రంథాలయ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి, ఎస్‌వీఎం పాఠశాల కరస్పాండెంట్ పంజాల నర్సయ్యగౌడ్, సహకార సంఘం సీఈఓ కిరణ్‌రెడ్డి, విద్యార్థి నాయకుడు తొండల అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలో శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాస కవిత, యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, నరేశ్ నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి హైస్కూల్‌లో చేయూత ఫౌండేషన్, ఏపీఎఫ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు ఆలె చిరంజీవి, దుబ్బాక ఆకాశ్‌రెడ్డి, అక్కెనపల్లి శివ, యువరాజు, భాను, మహేశ్ పాల్గొన్నారు.

గుండాల : ఛత్రపతి శివాజీ సేన ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి బండకొత్తపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శివాజీ సేన సభ్యులు దివాకర్‌రెడ్డి, రమేశ్, విజయ్‌రెడ్డి, నవీన్, మధు, సాయి, ప్రసాద్, వెంకటస్వామి, రాజాచారి, శేఖర్, రాజు, బాలు, మహేశ్, మణి పాల్గొన్నారు.

పాముకుంటలో శివాజీ విగ్రహావిష్కరణ

రాజాపేట, ఫిబ్రవరి 19 : మండలంలోని పాముకుంట గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఛత్రపతి పోరాటపటిమను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎడ్ల నరేశ్‌రెడ్డి, విగ్రహ దాత రాపోలు నాగార్జున్‌రెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)లో శివాజీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న శివాజీ యూత్ క్లబ్ సభ్యులు

సోమనాథ క్షేత్ర యోగాలయ భవనం ప్రారంభం

సాక్షి గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్, ఫిబ్రవరి 19 : పట్టణంలోని పాటిమీది ఆంజనేయస్వామి ఆలయం పక్కన సోమనాథ క్షేత్ర యోగాలయ నూతన భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమనాథ మహర్షి విగ్రహ ఆవిష్కరణ చేశారు. అదేవిధంగా వలిగొండ రోడ్డు సమీపంలోని నూతన శివాలయంలో సాక్షి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివస్వాములకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ సందగళ్ల విజయ సతీశ్ గౌడ్, నాయకులు బడుగు నర్సింహ, కృష్ణప్రసాద్ గుప్తా, బడుగు మాణిక్యం, ఆదిమూలం శంకర్, నర్సింహ పాల్గొన్నారు.

సౌజన్యకు ఓయూ డాక్టరేట్

డాక్టరేట్ పొందిన సౌజన్య

వలిగొండ, ఫిబ్రవరి 19 : మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన ఎడవెల్లి సౌజన్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ఇటీవల డాక్టరేట్ పొందారు. ఇంపాక్ట్ ఆఫ్ ఉమెన్ రిసోర్స్ ప్రాక్టీసెస్ ఆన్ ఎంప్లాయీస్ జాబ్ శాటిస్ఫాక్షన్ ఇన్ సెలెక్ట్ ఫార్మాస్యూటికల్ కంపెనీస్ ఇన్ హైదరాబాద్, తెలంగాణ స్టేట్ అనే పరిశోధన అంశంపై ప్రొఫెసర్ జహంగీర్ పర్యవేక్షణలో తాను సమర్పించిన పరిశోధన వ్యాసానికి డాక్టరేట్ పొందినట్లు ఆమె తెలిపారు. డాక్టరేట్‌కు పొందిన సౌజన్యను బంధుమిత్రులు అభినందించారు.